

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 27 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 197 పేజీలు: 4 వెల: రూ 3-00


## చైనాకు సున్నితంగా షాక్ ఇచ్చిన మోదీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భారత్ పర్యటనకు గురువారం వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన విజ్ఞప్తిని భారత ప్రభుత్వం సున్నితంగా, దృఢంగా, వినమ్రంగా తిరస్కరించింది. వాంగ్ దాదాపు రెండేళ్ళ తర్వాత ఆకస్మికంగా భారత్ పర్యటనకు వచ్చారు. తూర్పు లడఖ్‌లో భారత్-చైనా మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు జరుగుతున్న చర్చల్లో పురోగతి కనిపించని నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. ప్రధాని మోదీ శుక్రవారం ఉత్తర



ప్రదేశ్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోదీ హాజరయ్యారు. వాంగ్ యీ న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లతో చర్చలు జరిపారు. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి నెలకొన్న సమస్యలపై జైశంకర్ చర్చించారు. 2020 ఏప్రిల్ నుంచి ఎల్ఏసీ వెంబడి అసాధారణ రీతిలో మోహరించిన దళాలను చైనా ఉపసంహరించే వరకు ఇరు దేశాల మధ్య పరిస్థితులు సాధారణ స్థితికి చేరబోవని స్పష్టం చేశారు. వాంగ్ మాట్లాడుతూ, ఇరు దేశాలు దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరించాలన్నారు. సరిహద్దు వివాదానికి అతీతంగా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. భారత దేశంతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలని తాము కోరుకుంటున్నామన్నారు. అయితే జైశంకర్ స్పందిస్తూ, మొదట ఎల్‌ఏసీ వెంబడి ప్రతిష్టంభన పరిష్కారమవాలని స్పష్టం చేశారు. చైనాతో సుస్థిర సంబంధాలను కోరుకుంటున్నామన్నారు.

## చంద్రబాబు ఆరాచకాలపైనా చర్చ జరగాలి: అంబటి



తాడేపల్లి: సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన చూసి ఓర్వలేక పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారంటూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు మండిపడ్డారు. తమ ప్రభుత్వ పాలనలో జరిగిన మంచితో పాటు టీడీపీ పాలనలోనూ జరిగిన దారుణాల గురించి చర్చ జరగాల్సిన అవసరం ఉందని అంబటి అభిప్రాయపడ్డారు. శనివారం సాయంత్రం వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటోందన్నారు. టీడీపీ పాలనలో ఏమైనా సంస్కరణలు జరిగాయా? అని ఆయన నిలదీశారు. "సీఎం జగన్ పాలనలో 34 నెలల్లోనే ఎన్నో సంస్కరణలు జరిగాయి. టీడీపీ 40 పాలనలో ఏం జరిగింది?. ఈ రెండింటి మధ్య బహిరంగ చర్చకు సిద్ధమా?" అని చంద్రబాబుకు సవాల్ విసిరారు అంబటి. ఒకవేళ చర్చకు నారా లోకేష్‌ను పంపినా ఫర్వాలేదని, మా ప్రభుత్వ స్థాయి వ్యక్తి కాకపోయినా ఆయనతో కూడా చర్చకు సిద్ధం" అని పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నాడు.. మార్చి 29న చంద్రబాబు ఆరాచకాలను రాష్ట్ర ప్రజలకు వివరిస్తానని అంబటి చెప్పారు. ఎన్టీఆర్ మద్యపాన నిషేధం విధిస్తే.. చంద్రబాబు దానిని ఎత్తేశాడు. ఇప్పుడు సీఎం జగన్ మద్యాన్ని నియంత్రిస్తున్నారు. అసలు వ్యవస్థలను నాశనం చేసిందే చంద్రబాబు. ఏది ఏమైనా.. ఉగాది నుంచి కొత్త జిల్లాల్లో పాలన మొదలవుతుంది. మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలకు అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుంది. చంద్రబాబు మాత్రం అమరావతే కావాలంటున్నారు అని ఆక్షేపించారు అంబటి.

## ఏప్రిల్ 2న కొత్త జిల్లాలను ప్రారంభించనున్న సీఎం జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం కొలిక్కి వస్తోంది. వారం రోజుల్లో తుది నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారులు కార్యాలయాలను గుర్తించారు. కొత్తగా ఏర్పాటయ్యే 13 జిల్లాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉగాది రోజున (ఏప్రిల్ 2) లాంఛనంగా ప్రారంభిస్తారు. కొత్త జిల్లాలకు

కలెక్టర్, ఒక జేసీ, ఎస్పీని ప్రభుత్వం నియమించనుంది. రెవెన్యూ డివిజన్లు కూడా పెరిగే అవకాశం ఉంది. పోలీస్ శాఖలోనూ విభజనకు కసరత్తులు జరుగుతున్నాయి. మరోవైపు ఆర్థిక శాఖ కూడా ఉద్యోగుల విభజన అంశాన్ని పూర్తి చేస్తోంది. ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన వినతులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఈ క్రమంలో కొన్ని జిల్లాల పేర్లు మార్పు, కొన్ని మండలాల జిల్లాల మార్పులు వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

## రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెంపు...కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ముంబై: రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమర్థించారు. ఇది భారత ప్రభుత్వ పరిధిలో లేదని మంత్రి చెప్పారు. గత నాలుగు రోజుల్లో మూడుసార్లు ఇంధన ధరలను పెంచడాన్ని నియంత్రించలేమన్నారు .ముంబైలో జరిగిన ఓ శిఖరాగ్ర సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారతదేశంలో 80 శాతం చమురు దిగుమతి అవుతుంది. రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగాయి. దీని గురించి మేం ఏమీ చేయలేం" అని గడ్కరీ వివరించారు.



## ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్లిందో లెక్క తేల్చాలి: యనమల



అమరావతి: అవకతవకలపై కేంద్రం జోక్యం చేసుకుని సీబీఐతో విచారణ జరిపించాలని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. రాష్ట్రంలో ఆర్టికల్ 350 ప్రయోగించి ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రూ. 1.78 లక్షల కోట్లు ఖర్చుపెడితే రూ. 48 వేల కోట్లకు లెక్కల్లేవన్నారు. లెక్కలు చెప్పలేకపోతే.. ఎవరి జేబుల్లోకి వెళ్లిందో లెక్క తేల్చాలన్నారు. స్పెషల్ బిల్లుల పేరుతో ఖర్చుపెట్టామని ప్రభుత్వం చెబుతోందన్నారు. స్పెషల్ బిల్లులు అనేవి ట్రెజీ కోడ్‌లోనే లేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని ప్రభుత్వ పెద్దలు దిగమింగుతున్నారని ఆరోపించారు. కేంద్రం ఆదుకోకుంటే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు. న్యాయస్థానాల తీర్పులపై చట్టసభల్లో మాట్లాడకూడదనే నిబంధనను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఏడాదిలో ప్రతిరోజూ వేజ్ అండ్ మీన్స్ కింద అప్పులుతెచ్చారని ఆయన పేర్కొన్నారు. అలానే ప్రతి మూడున్నర రోజులకు ఓడీకింద అప్పులు తెచ్చారని చెప్పారు. అవికాకుండా మార్కెట్ బారోయింగ్స్ కింద రూ. 55వేలకోట్లు హాఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కింద రూ. లక్షా 9వేలకోట్లు అప్పులు తెచ్చారని పేర్కొన్నారు.

## విశాఖ రైల్వే జోన్ బీజేపీ వల్లనే సాధ్యమైంది: సోమువీర్రాజు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరాల జల్లులు కురిపించారని బీజేపీ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతం అయిందని కేంద్ర మంత్రి ప్రకటించారని తెలిపారు. ఏపీ చిరకాల కోరిక విశాఖ రైల్వే జోన్ బీజేపీ వల్లనే సాధ్యమైందని చెప్పుకొచ్చారు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం షేర్ కట్టకపోవడంతో బీజేపీ మాత్రమే ఉద్యమం చేస్తోందని తెలిపారు. అదే విధంగా కడప - బెంగుళూరుకు రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం షేర్ జమ చేయకపోవడంతో పనులు ఆగిపోతాయని ప్రకటించారు అంటే కడప - బెంగుళూరు రైల్వే లైన్ స్టేట్ షేర్ కట్టించేవిధంగా ఉద్యమిస్తామని అన్నారు. ఏపీ రైల్వే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడం వల్ల ఆంధ్రాకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సోమువీర్రాజు హెచ్చరించారు.



## ఎప్పుడూ ఇంత ఘోరంగా అసెంబ్లీ సమావేశాలు జరగలేదు: రామకృష్ణ

విజయవాడ: ఈసారి జరిగిన అసెంబ్లీ సమావేశాలు.. సభ హుందాను దిగజార్చారని, 1953-2022 వరకు జరిగిన సమావేశాలలో ఎప్పుడూ ఇంత ఘోరంగా జరగలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యలు, పరిష్కారంపై చర్చలు జరగలేదని, ఏక పక్షంగా నిర్ణయాలు ఆమోదించుకోవడం, ప్రతిపక్ష సభ్యులను తిట్టడానికే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారని దుయ్యబట్టారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరితే అరెస్టులు చేస్తారా?.. ప్రభుత్వ వైఫల్యాలను అడిగే స్వేచ్ఛ కూడా లేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులను సస్పెన్షన్ చేసి... సీఎం జగన్ భజన చేయించుకుంటారా అని మండిపడ్డారు. కోర్టులను కూడా తప్పుబట్టి నోటికి వచ్చినట్లు మాట్లాడతారా?.. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రాకపోతే విమర్శలు చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ రాజ్యాంగ బద్దంగా నిర్ణయాలు చేస్తే కోర్టుల జోక్యం అవసరం ఉండదని రామకృష్ణ అన్నారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా ఘటనపై సాక్షాత్తు ముఖ్యమంత్రి అసెంబ్లీలో అసత్యాలు చెప్పారని విమర్శించారు. ఏమీ జరగకపోతే ఎక్సైజ్ అధికారులు ఎలా చర్యలు తీసుకున్నారన్నారు. మరీ ఇంత పచ్చిగా జగన్ అబద్ధాలు చెబుతుంటే... ఆ పార్టీ ఎమ్మెల్యేలు భజన చేస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ఆ కుర్చీకి ఉన్న పరువు తీస్తున్నారన్నారు. మంత్రి పదవి కోసం తమ్మినేని సభాపతి పదవిని దిగజార్చారన్నారు. ఈనెల 28, 29 తేదీలలో చేపట్టిన సమ్మెకు అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపిచ్చారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకునే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



## ఇదేనా ముఖ్యమంత్రి... మహిళలకు మీరిచ్చే భద్రత?: లోకేష్



అమరావతి: రాష్ట్రాన్ని రావణకాష్టం చేయడానికి వైసీపీ అధినేత జగన్ రెడ్డి, ఆయన పార్టీ నేతలు కంకణం కట్టుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు అధికారం ఇచ్చింది..కబ్జాలు, దోపీడీలు, అడ్డుపడినవారిని చంపడానికి లైసెన్సు అన్నట్టు దారుణాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. చిత్తూరు జిల్లా కురబలకోట మండలం కొంగావారిపల్లికి చెందిన గాజుల వ్యాపారి రమణమ్మని ఆర్థిక వ్యవహారాలలో ఏర్పడిన వివాదంతో వైసీపీ నేత ఎన్. వెంకట్రమణారెడ్డి అతి దారుణంగా కొట్టి చంపడం రాష్ట్రంలో వైసీపీ దండుపాళ్యం గ్యాంగ్ అరాచకాలకి పరాకాష్ట అని ఆయన వ్యాఖ్యలు చేశారు. జగన్‌రెడ్డి దిశ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించి మహిళల భద్రతకి నాది భరోసా అని మాయమాటలు చెప్పి మూడురోజులు కాలేదు... వైసీపీకి చెందిన వెంకట్రమణారెడ్డి ఓ మహిళను అత్యంత పాశవికంగా కొట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా ముఖ్యమంత్రి మహిళలకు మీరిచ్చే భద్రత? అని ప్రశ్నించారు. అండగా నిలవాల్సిన ప్రభుత్వమే అంతమొందిస్తుంటే, న్యాయం చేయాల్సిన పోలీసులు అన్యాయంగా వ్యవహరిస్తుంటే..రాష్ట్ర ప్రజల ప్రాణాలకి దేవుడే దిక్కు అని లోకేష్ అన్నారు.

## ఆర్థిక అరాచకానికి పరాకాష్ట: రఘురామ



న్యూఢిల్లీ: ఏపీ ఆర్థిక అరాచకం అంత మాయని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టినదానికి, ఖర్చు చేసిన దానికి సంబంధంలేదని ఎంపీ రఘురామ కృష్ణం రాజు విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినదానికి సంబంధం లేకుండా జరుగుతోందంటే... అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అనే సందేహం కలుగుతోందన్నారు. ఆర్థిక అరాచకానికి పరాకాష్టని అన్నారు. దీన్ని ఆర్థిక ఉన్మాదం అంటారా? ఆర్థిక తీవ్రవాదం అంటారా? ఆర్థిక అనావృష్టి అంటారా? ఏమంటారని ఆయన ప్రశ్నించారు.కార్పొరేషన్ ద్వారా చేసిన అప్పులను బడ్జెట్‌లో చూపెట్టలేదన్నారు. సివిల్ సప్లైస్ బడ్జెట్ రూ. 4,622 కోట్లు.. అయితే ఖర్చు పెట్టింది కేవలం రూ. 104 కోట్లు మాత్రమేనన్నారు. బీసీ వెల్ఫేర్ కోసం ఖర్చు పెట్టింది ఏమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు ఎంత ఉన్నాయో చూపెట్టలేదని రఘురామ అన్నారు.




# సంపాదకీయం

ఆదివారం 27 మార్చి 2022

## చైనా విదేశాంగ మంత్రి పర్యటనలో అంతర్యం?

భారత్‌లో ఆకస్మిక పర్యటనకు వచ్చారు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ. చైనాతో పాటు ఇండియా కూడా ఆయన పర్యటన విషయాన్ని సీక్రెట్‌గా ఉంచింది. కాబూల్ నుంచి విమానం టేకాఫ్ అయిన తర్వాత కానీ వాంగ్ వస్తున్న సంగతి బయటకు రాలేదు. ఇంతకీ వాంగ్ పర్యటన ఆంతర్యం ఏంటి..? గాల్వాన్ లోయ ఘర్షణ తర్వాత భారత్, చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. 2020 జూన్‌లో జరిగిన ఆ ఘర్షణలో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య హై ప్రొఫైల్ మీటింగ్ జరగలేదు. ఇన్నాళ్లకు ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీ వచ్చారు. భారత విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్‌తో భేటీ అయ్యారు. దీనికి ముందు నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ ధోవల్‌ను కలిశారు. ధోవల్, వాంగ్ చాలా కాలంగా ఇరు దేశాల సరిహద్దు చర్చలకు ప్రత్యేక ప్రతినిధులుగా ఉన్నారు. దాంతో బోర్డర్ ఇష్యూస్‌తో పాటు ఉక్రెయిన్ వార్ ఎఫెక్ట్‌పై కూడా వారిద్దరూ చర్చించారు. సరిహద్దుల్లో వివాదాస్పద ప్రాంతాల నుంచి బలగాలను పూర్తిగా ఉపసంహరించే విషయం చర్చకు వచ్చింది. ద్వైపాక్షిక సంబంధాలు బెటర్ అయ్యేందుకు అడ్డంకులను తొలగించే అంశంపైనా చర్చించారు. వాంగ్‌తో భేటీ విషయాన్ని జయశంకర్ ట్విట్టర్‌లో షేర్ చేశారువాంగ్ పర్యటనను భారత్, చైనా సీక్రెట్‌గా ఉంచాయి. వాంగ్ ఢిల్లీ వచ్చే ముందు పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో పర్యటించారు. పాక్‌లో ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన విషయాలు పూర్తిగా భారత్ అంతర్గత వ్యవహారం. చైనాతో సహా ఇతర దేశాలకు మాట్లాడే హక్కు లేదని స్పష్టం చేసింది. ఈ హీట్‌లోనే వాంగ్ ఇండియా వచ్చారు. ఈ ఏడాది చైనాలో జరగనున్న బ్రిక్స్ సమావేశాలకు ప్రధాని మోదీని ఆహ్వానించడం కూడా వాంగ్ పర్యటన ముఖ్య ఉద్దేశం. మే 2020లో తూర్పు లడఖ్‌లో ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత చైనా సీనియర్ నాయకుడు భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ప్రయాణ ప్రతిపాదన చైనా నుండి వచ్చింది. వాంగ్ యీ తన నాలుగు దేశాల పర్యటనలో భాగంగా నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లను కూడా వెళ్లనున్నారు. ఇందులో భాగంగా రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం వాంగ్ మార్చి 26న నేపాల్ రాజధానికి చేరుకోనున్నట్లు నేపాల్ 'ఖాట్మండు పోస్ట్' పేర్కొంది. అంతకుముందు, పాకిస్తాన్‌లో జరిగిన ఓఐసీ సమావేశంలో జమ్మూ కాశ్మీర్‌పై చైనా చేసిన ప్రకటనలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది ఒకటిన్నర సంవత్సరాల్లో, తూర్పు లడఖ్‌లో ఉద్రిక్తతలను తగ్గించడానికి విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, వాంగ్ యీ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాస్కో, దుషాన్‌బేలో అనేక రౌండ్ల చర్చలు జరిపారు. సెప్టెంబరు 2020లో జైశంకర్, వాంగ్ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మాస్కోలో విస్తృతమైన చర్చలు జరిపారు. ఈ సమయంలో వారు తూర్పు లడఖ్ సరిహద్దు ప్రతిష్టంభనను పరిష్కరించడానికి ఐదు పాయింట్ల ఒప్పందానికి వచ్చారు. దళాలను ముందస్తుగా ఉపసంహరించుకోవడం, ఉద్రిక్తత పెంచే చర్యలను నివారించడం, సరిహద్దు నిర్వహణపై అన్ని ఒప్పందాలు, ప్రోటోకాల్‌లకు కట్టుబడి ఉండటం, వాస్తవ నియంత్రణ రేఖ వెంట శాంతిని పునరుద్ధరించే చర్యలు ఇందులో ఉన్నాయి. సరిహద్దు రేఖపై దృష్టి సారించిన మరో ఆ సమావేశం సందర్భంగా ఇరు దేశాల విదేశాంగ మంత్రులు గత ఏడాది జూలైలో తజికిస్తాన్ రాజధాని నగరం దుషాన్‌బేలో ద్వైపాక్షిక సమావేశాన్ని కూడా నిర్వహించారు. వారు సెప్టెంబర్‌లో దుషాన్‌బేలో మళ్లీ కలుసుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధికి వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసి) వెంబడి శాంతి చాలా ముఖ్యమైనదని భారతదేశం స్థిరంగా నొక్కి చెబుతోంది. గత వారం, విదేశాంగ కార్యదర్శి హర్షవర్ధన్ ష్రింగ్లా మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మన సంబంధాల అభివృద్ధికి సరిహద్దు ప్రాంతాల్లో శాంతి అవసరమని చైనాకు స్పష్టం చేశామని ష్రింగ్లా చెప్పారు. భారతదేశం చైనా సంబంధాల అభివృద్ధి పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం, పరస్పర ఆసక్తిపై ఆధారపడి ఉండాలి. ఇదే అంశానికి సంబంధించి ఈ నెల ప్రారంభంలో, వాంగ్ అమెరికాకు పరోక్ష సూచన చేశారు. చైనా భారతదేశం మధ్య ఉద్రిక్తత సృష్టించడానికి కొన్ని శక్తులు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. మార్చి 11న, తూర్పు లడఖ్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి భారత్ చైనా 15వ రౌండ్ ఉన్నత స్థాయి సైనిక చర్చలను నిర్వహించాయి. అంతకుముందు, పాకిస్తాన్‌లో జరిగిన ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ సమావేశంలో జమ్మూ మరియు కాశ్మీర్‌పై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి చేసిన ప్రకటనను భారత్ తీవ్రంగా ఖండించింది. అదే సమయంలో, జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన అంశాలు పూర్తిగా దేశ అంతర్గత వ్యవహారాలని భారత్ పేర్కొంది. ఓఐసీ సమావేశంలో వాంగ్ జమ్మూ కాశ్మీర్ ప్రస్తావనకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ మాట్లాడుతూ, ప్రారంభ సెషన్‌లో ప్రసంగం సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారతదేశం గురించి అనవసరంగా ప్రస్తావించడాన్ని మేము తిరస్కరిస్తున్నామన్నారు. జమ్మూ కశ్మీర్ విషయంలో ఇతర దేశాల జోక్యాన్ని ఏమాత్రం సహించబోమన్నారు.

## మంత్రి వర్గంలో బెర్తు కోసం భజనలు

విజయవాడ, మార్చి 26, ఆంధ్రప్రదేశ్ కేబినెట్ ను పునర్వ్యవస్థీకరిస్తానని సీఎం వైఎస్ జగన్ అన్నప్పటి నుంచీ ఆశావహుల భజన అవధులు దాటేస్తోంది. జగన్ ను పొడడంతోనే సరిపెట్టుకోకుండా ప్రతిపక్ష నేతలపై అవాకులు చెవాకులు మాట్లాడడానికి కూడా వారు వెనకాడడం లేదు. అసెంబ్లీ వేదికగా కూడా ఈ భజన బృందం తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. జగన్ ను పొగిడే విషయం యతి ప్రాసల్ని, ఉపమానాల్ని, సామెతలను కూడా వాడేస్తుండడం విశేషం. ఇలాంటి చర్యలన్నీ ఎలాగైనా జగన్ దృష్టిని ఆకర్షించి, కొత్త కేబినెట్ లో బెర్త్ కొట్టేయాలనే ప్రణాళిక ప్రకారమే వారంతా పొగడ్తలు, తెగడ్తలతో రెచ్చిపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా రోజా మాట్లాడారు. ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల చివరి రోజు శుక్రవారం సభలో నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా చేసిన వ్యాఖ్యలు జగన్ రెడ్డిని ఎంతగా పొగిడితే అంత లాభం అనే ధోరణిలో కొనసాగాయని అర్థమవుతోందంటున్నారు. టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 'అఖండ' అయితే.. ఆయన బావ, వియ్యంకుడు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడ్ని 'అనకొండ' అని, చంద్రబాబు కుమారుడు, ఎమ్మెల్సీ నారా లోకేష్ ను 'పప్పుండ' అంటూ అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యానించడం పట్ల టీడీపీ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. చంద్రబాబు, బాలకృష్ణ, లోకేష్ ను విమర్శించడంతో ఆగని రోజా జగన్ ను ఏకంగా 'బంగారుకొండ' పోల్చారు. ఆ ముగ్గురూ బంగారుకొండ జగన్ ను ఢీకొనడా సాధ్యం కాదనేది రోజా యతి ప్రాసల ప్రసంగం. మరో అడుగు ముందుకేసిన రోజా.. సుపరిపాలనలో జగన్ ఫేమస్ అంటూ భజన చేయడం అందర్నీ ఆకర్షించింది. అక్కడితో ఆపకుండా ఏకంగా దేవుళ్లు, దేవతలతో సమానంగా జగన్ ను పోల్చడంపై సర్వత్రా విమర్శలకు తావిచ్చినట్లయింది. తిరుపతిలో వెంకన్న ఫేమస్ అయితే.. బెజవాడలో కనకదుర్గమ్మ ఫేమస్.. విశాఖపట్నంలో సింహాద్రి అప్పన్న ఫేమస్.. సుపరిపాలనలో జగన్ ఫేమస్ అని ఆమె పొగడాన్ని చూస్తూ అందరూ అవాక్కవుతున్నారు. అంతేకాదట.. గన్ పట్టుకున్న వందమంది పనికిరాని వాళ్ల కంటే గన్ లాంటి ఒక్క జగన్ చాలంటూ కొనియాడడం గమనార్హం. నిజానికి మంత్రి పదవి దక్కించుకోవాలని రోజా ఎన్నాళ్లుగానో ఎదురుతెన్నులు చూస్తున్నారు. తీరా మంత్రివర్గ విస్తరణ చేస్తామని సీఎం జగన్ అన్నప్పటి నుంచి ఆమెకు పోటీగా విడదల రజనీ బరిలోకి వచ్చారు. దీంతో రోజా ఆశలు గల్లంతయ్యే ప్రమాదం ముంచుకొచ్చేలా ఉందంటున్నారు. సామాజిక సమీకరణాలు, జిల్లాల సర్దుబాట్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రోజాకు కేబినెట్ బెర్త్ దక్కడం కాస్త కష్టమే అంటున్నారు. అయినప్పటికీ చివరి ప్రయత్నాల్లో భాగంగానే రోజా జగన్ ను ఓ రేంజ్ లో అసెంబ్లీ వేదికను ఉపయోగించుకున్నారంటున్నారు. రోజా మంత్రి పదవిపై కన్నేశారు. దేవుడిచ్చిన అన్న జగన్ అంటూ ఏ సందర్భం వచ్చినా రోజా చెప్పుకుంటూనే ఉంటారు. అలాంటి దేవుడిచ్చిన అన్న మాత్రం ఎందుకో మంత్రి పదవి మాత్రం ఆమెకు రుచి చూపించడం లేదనే అనుమానాలు పలువురిలో వస్తుండడం గమనార్హం. కేవలం ఏపీఐఐసీ చైర్మన్ పదవితోనే రోజాకు సరిపెట్టడం వెనుక ఏమైనా రహస్యం ఉందా? విశేషం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి రోజాకు హోంమంత్రి పదవిని జగన్ ఈసారి కట్టబెడతార ంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఏమో ప్రస్తుత హోం మంత్రి మేకతోటి సుచరిత అలికిడి కొద్దిగా తగ్గిపోయినట్లు కనిపిస్తోంద ంటున్నారు. విడదల రజనీ నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకుని, పొగడ్తల తోనైనా ఈసారి రోజా మంత్రి పదవి దక్కించుకుంటారో లేదో కేవలం కొద్ది రోజుల్లోనే తేలిపోతుంది.

## బెర్త్ కోసం ఎక్కే గుమ్మం.. దిగే గుమ్మం

విజయవాడ, మార్చి 26, త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అని ముఖ్యమంత్రి స్పష్టంగా తేల్చి చెప్పేయటంతో బెర్త్ కోసం కొందరు, ఎర్త్ పడకుండా మరి కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పార్టీ కోర్ టీమ్ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. వైసీపీలో మంత్రి పోస్ట్ కోసం లాబీయింగ్ పతాకస్థాయికి చేరింది. మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసినప్పుడే పదవీకాలం రెండున్నర ఏళ్లు అని సీఎం జగన్ ఎమ్మెల్యేలకు స్పష్టంగా చేప్పేశారు. మంత్రివర్గాన్ని దాదాపుగా పునర్వ్యస్థీకరించి కొత్తవారికి అవకాశం కల్పిస్తామన్నారు. అధినేత చెప్పిన సమయం రానే వచ్చింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్నవాళ్లలో కొందరు ఇంటికి వెళ్లక తప్పదు. కొన్ని సమీకరణల వల్ల ఒకరిద్దరికి మినహాయింపు ఉంటుందని సీఎం జగన్ చెప్పటంతో మరింత ఉత్కంఠ పెరుగుతుంది. ఆ మినహాయింపులో కేబినెట్ బెర్త్‌ను కాపాడుకునేందుకు కొందరు మంత్రులు ప్రయాసలు పడుతున్నట్టు సమాచారం. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి కోర్ టీమ్ సభ్యుల గుడ్‌లుక్స్ కోసం తెగ శ్రమిస్తున్నారట. వీరితోపాటు కొత్తగా మంత్రి పదవి ఆశిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం కోర్ టీమ్ సభ్యుల ఆఫీసులకు క్యూ కడుతున్నారు. ఉగాది నాటికి జిల్లాల విభజన అధికారికంగా జరగనుండటంతో మంత్రివర్గ కూర్పులో ఆ సమీకరణాలు కూడా కీలంగా మారబోతున్నాయి. ఈ తూకంలో నిలిచేది ఎవరు.. గెలిచేది ఎవరు అన్నదే ప్రశ్న. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో ఏదో రకంగా సీఎం దృష్టిలో పడేందుకు ఎమ్మెల్యేలు.. మంచి మార్కులు కొట్టి పదవి పదిలం చేసుకునేందుకు కొందరు మంత్రులు కొత్త పంథాలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అమాత్యులు తమను కేబినెట్‌లో కొనసాగించాలని పార్టీ ముఖ్య నేతలను నేరుగానే అడిగేస్తున్నారట. ప్రస్తుతం ఈ విజ్ఞప్తులు.. ఎమ్మెల్యేల ఫీట్లు పార్టీలో చర్చగా మారాయి. ఎమ్మెల్యేలు ఏ ఇద్దరు ముగ్గురు కలిసినా వీటిపైనే చర్చ. మరి.. అధికారపార్టీలో ఈ విన్నపాలు ఎంతవరకు వర్కవుట్ అవుతాయో.. ఎవరి ఆశలను నెరవేరతాయో చూడాలి. సీఎం జగన్ ఫ్రేమ్‌లో పట్టేదెవరో కూడా వేచి చూడాల్సిందే.

## చాప చుట్టేసిన ఎల్జీ పాలిమర్స్

విశాఖపట్టణం, మార్చి 26, గతంలో హిందుస్థాన్ జింక్ పరిశ్రమను వేదాంత స్టెరిలైట్ కంపెనీ కొనుక్కుని వందలెకరాలను ఎలాగైతే కొల్లగొట్టుకుని ప్లాట్లుగా అమ్ముకుందో... తాజాగా ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం వెంకటాపురం నుంచి వేరొక చోటకి వెళ్లిపోతూ భూములపై లావాదేవీలు నెరపుతోంది. 2020 మే ఏడున జరిగిన విషవాయువు (స్టైరీన్) లీకైన ఘటన తర్వాత ప్రజా ఆందోళనలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కంపెనీని మూసివేసింది. 40 మంది పర్మినెంట్ కార్మికులకు ఆర్థికపరమైన సెటిల్‌మెంట్ 2021లో ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం పూర్తి చేసింది. 360 మంది కాంట్రాక్టు కార్మికులను మాత్రం రోడ్డున పడేసింది. వెంకటాపురం గ్రామానికి చెందిన వీరందరూ ప్రభుత్వం ప్రకటించిన 'రెడ్ జోన్' పరిధిలోకే వస్తున్నా యాజమాన్యం వీరికి ఎలాంటి పరిహారమూ చెల్లించలేదు. కంపెనీ లోపల కొద్దిమందితో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్, ఇక్కడ నుంచి ఎల్‌జి కంపెనీని తరలించడానికి అవసరమైన ఏర్పాట్లు తాజాగా చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వెంకటాపురం గ్రామంలో వైసిపికి చెందిన స్థానిక నాయకుడు బెహరా భాస్కరరావు పంచాయితీలు నిర్వహిస్తు న్నట్లు స్థానికులు చెబుతున్నారు. కంపెనీ యాజ మాన్యం అన్యాయం చేయకుండా అండగా ఉంటానని చెప్పడంలో మతలబు ఉందని స్థానికులు అంటున్నారు. యాజమాన్యం ఏదో చేస్తోంది? అది వైసిపి నేతలకు మాత్రమే తెలుసు? అంటూ ప్రజల్లో చర్చ సాగుతోంది. గ్యాస్ లీకేజీ ఘటనపై సిపిఎం, సిపిఐ, టిడిపి, ఇతర ప్రతిపక్షాలు మాత్రమే పోరాడాయి. వైసిపి మధ్యవర్తిత్వం నెరపింది. ఈ సందర్భంలో కూడా కీలకంగా వ్యవహరించని నేతలు ఇప్పుడు పంచాయితీలు నిర్వహిస్తుండడంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటన జరిగిన తర్వాత రెడ్‌జోన్‌గా వెంకటాపురాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడి ఐదు వేల జనాభాకు అవసరమైన కనీస అవసరాలు, తిండి, సరకులను ఇచ్చే బాధ్యత కనీసం ఐదు నెలల పాటు ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం చేపట్టాలని ఆదేశించింది. ఒక్క నెల మాత్రవే దీనిని యాజమాన్యం అమలుచేసి చేతులు దులుపేసు కుంది. అధికార వైసిపి నేతలెవ్వరూ దీనిపై ప్రశ్నించ లేదు. ఘటనానంతర పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను ఇటీవల ఇచ్చిన నిపుణుల కమిటీ కూడా వైద్య సేవల ప్రాధాన్యతను చెప్పింది. 2020 లో జిల్లా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గ్రామం లో పర్యటించారు.

12 బెడ్స్‌తో గ్రామంలో పర్మినెంట్ ఆస్పత్రిని ప్రభుత్వం నిర్మించనుందని ప్రకటించారు. దీనికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ అని నామకరణం చేశారు. వెంకటాపురం గ్రామంలో అప్పట్లో తాత్కా లికంగా క్లినిక్ ఏర్పాటు చేసి ఆ తర్వాత పట్టించు కోలేదు. ఇప్పటికీ ఎలాంటి భవనమూ నిర్మించలేదు. అందుకు తగిన ఏర్పాట్లూ ప్రభుత్వం చేయడం లేదు. ఘటన జరిగిన రోజే 12 మంది వెంకటాపురం గ్రామస్తులు విషవాయువు పీల్చి మృతిచెందగా, వీరి కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రభుత్వం అందజేసింది. విషవాయువు వల్ల మరో ముగ్గురు నాలుగైదు రోజుల వ్యవధిలో మరణించారు. ఆ ముగ్గురికీ ఇంతవరకూ రూ.కోటి పరిహారం దక్క లేదు. ఇంకా రోగాల బారిన, సైడ్‌ఎఫెక్ట్స్‌తో ప్రజలు బాధపడుతున్నా ప్రభుత్వ పెద్దలు కన్నెత్తి చూడడం లేదు. ఈలోగా సందట్లో సడేమియా అన్న చందంగా ఎల్‌జి యాజమాన్యం కొంతమంది బ్రోకర్లను గ్రామం లోకి దించి ఉద్యమం లేవకుండా తాను చాప చుట్టేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

## 28న భారీ ప్రదర్శనలు.29న నిరసనలు

### సార్వత్రిక సమ్మె నేపథ్యంలో కార్మిక సంఘాల పిలుపు

విశాఖపట్నం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో మార్చి 28వ తేదీన జిల్లాలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాలలో భారీ ప్రదర్శనలు, 29న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలియజేయాలని కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపుని చ్చింది. తిరుపతి యశోదా నగర్ లోని ఎంబి భవన్ లో రౌండ్ టేబుల్ సమా వేశం ఈ మేరకు తీర్మానించింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మురళి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు లేబూరి రత్నకుమార్, టిఎన్ టియుసి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు జయరామిరెడ్డి తదితరులు ప్రసంగిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం... రాష్ట్రంలోని జగన్మోహన్రెడ్డి ప్రభుత్వాలు ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నేపథ్యంలో వీటిని వెనక్కు కొట్టడానికి యావత్ కార్మికవర్గం వీధుల్లోకి రావాలని వారు పిలుపునిచ్చారు. 28, 29 తేదీలలో దేశం అంతటా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతాయని పాతిక కోట్ల మంది సమ్మెలో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సార్వత్రిక సమ్మెకు రైతాంగ మద్దతు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసుకుంటూ ప్రజలను క్షమాపణ కోరిందని... అదే రీతిన కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని నిలిపివేయాలని... దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆటో వాలా నుంచి విమాన పైలెట్ దాకా ఈ సమ్మెలో పాల్గొంటున్నారని చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. 26వ తేదీన అన్ని ప్రాంతాలలో స్కూటర్ ర్యాలీలు జరపాలని 28వ తేదీన భారీ ప్రదర్శన నిర్వహించాలని కోరారు. 28వ తేదీన తిరుపతి నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ ప్రదర్శన ఉంటుందని... 29వ తేదీన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని ప్రకటించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో టీటీడీ లాంటి ధార్మిక సంస్థలో ధర్మాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. 26వ తేదీన జిల్లా అంతట స్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని కోరారు.

## ఏడుగురు రష్యన్ జనరల్స్ హతం

న్యూఢిల్లీ నెలరోజులుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం మరింత ఉధృతమయింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ కు చెంపపెట్టులా ఇప్పటికి ఏడుగురు ఆ దేశ జనరల్స్ హతయినట్లు సమాచారం. ఈ మేరకు పలు వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి.. తాజాగా లెఫ్టినెంట్ జనరల్ యాకోవ్ రేజన్ట్సేవ్ మృతి చెందారు. యాకోవ్ రష్య 49వ కంబైన్డ్ ఆర్మ్స్ ఆర్మీకి చెందిన లెఫ్టినెంట్ జనరల్. మరో ఆర్మీ కమాండర్ జనరల్ వ్లాయిస్లావ్ యేర్సోహ్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఈయన ఆరో కంబైన్డ్ ఆర్మ్స్ ఆర్మీకి చెందిన జనరల్. అయితే యేర్సోహ్ను వారం రోజుల క్రితమే బాధ్యతల నుంచి తొలగించారు. ఉక్రెయిన్పై రష్యా మిలిటరీ జరిపిన దాడిలోవ్యూహాత్మక వైఫల్యాల కారణంగా యేర్సోహ్ను బాధ్యతల నుంచి ఆకస్మికంగా తొలగించారు. ఈ ఏడుగురిలో చెచెన్ స్పెషల్ ఫోర్సెస్ జనరల్ మగోమద్ తుషేవ్ కూడా ఉన్నారు. అంద్రే సుఖోవెట్సికి (మేజర్ జనరల్), విటలీ జెరాసిమోవ్ (మేజర్ జనరల్), అంద్రే కోలెస్నికోవ్ (మేజర్ జనరల్), ఒలెగ్ మిట్యయేవ్ (మేజర్ జనరల్), అంద్రే మోర్డివిచేవ్ (లెఫ్టినెంట్ జనరల్) లు వివిధ ప్రాంతాల్లో మృతి చెందారు.

## కాకినాడలో కిచిడి చేపలు

కాకినాడ, మార్చి 26, వలలో పెద్ద చేప పడిందంటే మత్స్యకారులకు పండగే. చేప చిన్నదైనా పులస లాంటి కాస్ట్‌లీదైతే మరీ హ్యాపీస్. వీటితో పాటు తూర్పుగోదావరిలో భయపెట్టే డేంజరస్ చేపలూ దొరుకుతున్నాయి. చేపలందు ఈ చేపలు వేరయా అనిపించే వెరైటీ ఫిష్ చిక్కడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వింత చేపలు, అందమైన చేపలు మత్స్యకారుల వలకు చిక్కితే సంబరపడతారు. వాటిని చూసేందుకు జనం కూడా ఎగబడతున్నారు. కచ్చిడి అనే ఓ రకం మగ చేపకు మహా డిమాండ్. మందుల తయారీలో వాడతారు. ఈ రకం చేపలు రెండు కాకినాడ, అంతర్వేది దగ్గర మత్స్యకారుల వలకు చిక్కాయి. సుమారు 30 కేజీల చేపలు ఒక్కోటి మూడు లక్షల వరకు ధర పలికాయి. మత్స్యకారుల పంట పండింది. అలాగే యానాంలో భారీ పండుగప్ప మత్స్యకారుల వలకు చిక్కింది. పండుగప్పలు మహా అయితే 3 నుంచి 4 కేజీల బరువు ఉంటాయి. కానీ యానాం పండుగప్ప మాత్రం 16 కిలోలపైనే ఉందట. లోకల్ మార్కెట్‌లో 8 వేల ధర పలికింది. దీన్ని ఏషియా సి బస్ అని కూడా పిలుస్తారు. గోదావరికి వరద వచ్చినప్పుడు దొరికే పులస చేపలకు చాలా డిమాండ్. ఆ టైమ్‌లో సముద్రం నుంచి ఎదురీది గోదావరికి వచ్చే ఇలసలు పులసలుగా మారతాయి. ఒక్కో పులస 3 వేల నుంచి 25 వేల ధర పలుకుతాయి. తాజాగా దొరికిన చేపలను చూసి మత్స్యకారులు భయపడుతున్నారు. అయ్య బాబోయ్ ఈ చేపలు ఎలా వచ్చాయంటూ గుండెలు బాదుకుంటున్నారు. నలుపు చారలు కలిగిన ఈ చేపలు పి.గన్నవరం మండలం మానేపల్లి పంట కాల్వలో దొరికాయి. వీటిని సక్కర్ ఫిష్ అంటారు. ఇవి పొరపాటున చెరువుల్లో చేరితే రైతులకు భారీ నష్టం తప్పదంట. కోనసీమలో మరో డేంజరస్ చేప కూడా ప్రత్యక్షమైంది. మనిషి ముఖాన్ని పోలినట్టు ఉండే చేపను చూస్తే వామ్మో అనాల్సిందే. ఇది ప్రపంచంలోకెల్లా రెండో విషపూరితమైన చేపట. ఇది ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప వద్ద మత్స్యకారుల వలకు చిక్కింది. దీన్ని బొంక చేప అని పిలుస్తారు. మామూలు చేపలానే ఉంటుంది. ఎవరైనా తాకినా, ప్రమాద సంకేతాలు కనిపించినా గాలి పీల్చుకుని బంతిలా ఉబ్బుతుంది. దీనిలో విషం మనిషిని చంపేంత ఉంటుందట.

## మారుతున్న సత్తెనపల్లి రాజకీయాలు

గుంటూరు, మార్చి 26, గుంటూరు జిల్లాలో రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం కలిగిన నియోజకవర్గం సత్తెనపల్లి. 2014లో కోడెల శివప్రసాదరావు, 2019లో అంబటి రాంబాబు ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఆ తర్వాత జరిగిన అనూహ్య పరిణామాలతో సత్తెనపల్లిలో టీడీపీ ఇరకాటంలో పడింది. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి ఎవరో తేల్చలేని పరిస్థితి. కోడెల మరణంతో నియోజకవర్గ టీడీపీ రాజకీయాలు కలగూరగంపలా తయారయ్యాయి. జిల్లాలో రాజకీయంగా ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరూ సత్తెనపల్లి సీటు నాదంటే నాది అని కామెంట్ చేసుకోవడం కేడర్‌కు విసుగు పుట్టిస్తోందట. చేతిలో నాలుగు డబ్బులు ఉంటే చాలు రెండు కార్లు వేసుకుని తిరుగుతూ.. సత్తెనపల్లి సీటు నాకే ఫిక్స్ చేశారని చెప్పుకొంటున్నారు కొందరు నాయకులు. నాలుగురోజులు వాళ్లతో తిరుగుతున్న కేడర్ సైతం ఎటూ తేలని పంచాయితీ అని సైలెంట్ అయిపోతుందట. సత్తెనపల్లి టీడీపీ టికెట్‌ను ఆశించే నాయకులు ఎక్కువగానే ఉన్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, రాయపాటి రంగబాబు, కోడెల శివరాం, నాగోతు శౌరయ్య తదితరులు ఉన్నారు. గడిచిన రెండు దశాబ్దాలుగా నియోజకవర్గంలోకి వైవీ తొంగి చూసింది లేదు. వైవీకి చెందిన విద్యాసంస్థల్లో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు జరిపారని.. ఒక దశలో పార్టీ మారిపోతారని ప్రచారం జరిగింది. కానీ.. సత్తెనపల్లి టికెట్ రేసులో తాను ఉన్నానని చెబుతూ.. నియోజకవర్గ పరిధిలో జరిగే శుభకార్యాలకు పిలిచిందే తడవుగా వెళ్లిపోతున్నారు. ఆయన హడావిడి చూసి కేడర్ అవాక్కవుతోంది. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు రంగబాబు సైతం సత్తెనపల్లిపై ఆశలు పెట్టుకున్నారు. 2019లోనే ఈ సీటు కోసం రాయపాటి విశ్వప్రయత్నం చేశారు. కానీ టికెట్ దక్కకపోవడంతో ఈ దఫా తప్పకుండా అవకాశం ఇస్తారని అనుకుంటున్నారట. ఈసారి సాంబశివరావు ఒఖగా పోటీ చేయకపోవచ్చని అంటున్నారు. ఆయన పోటీలో లేకుండా కొడుక్కి సత్తెనపల్లి సీటు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టే ఛాన్స్ ఉంది. టికెట్ ఆశిస్తున్న వారిలో మరో నేత కోడెల శివరాం. కోడెల శివప్రసాదరావు కుమారుడిగా సత్తెనపల్లిలో పోటీ చేసే హక్కు తనదే అని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. అయితే 2014 నుంచి 2019 వరకు ఆయన చేసిన పనులే ఆయనకు ఇబ్బందిగా మారాయి. అవే ఇప్పుడు అడుగడుగునా అడ్డు తగులుతున్నాయి. కోడెల వారసుడిగా శివరామ్‌కు లైన్ క్లియరయ్యి ఉంటే ఈ సమస్యే వచ్చేది కాదు. ఆయన మీద ఉన్న ఆరోపణలను హైకమాండ్ సీరియస్‌గా తీసుకుని సీటు ఇవ్వదనే ప్రచారంతో చాలామంది క్యూ కడుతున్నారు.

## లెక్కల సంగతి తేల్చండి

విజయవాడ, మార్చి 26, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్. రూ. 48 వేల కోట్లు ఖర్చుకు లెక్కల్లేవంటూ నేను ఏడాది క్రితం చెప్పిన దాన్నే ఇప్పుడు కాగ్ స్పష్టంగా చెప్పింది. ప్రభుత్వం లెక్కలకు సర్టిఫికెట్ ఇవ్వడానికి కాగ్ భయపడిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. రూ. 48 వేల కోట్లంటే.. 30 శాతం మేర బడ్జెట్టుకు లెక్కల్లేవని కాగ్ స్పష్టంగా చెప్పింది. ఇష్టం వచ్చినట్టు ప్రభుత్వం లెక్కలు చూపకుండా ఖర్చు పెట్టేస్తే చూస్తూ ఊరుకోవాలా..? ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికైనా కాగ్ అన్ క్వాలిఫైడ్ ఓపీనియన్ ఇచ్చింది.. కానీ తొలిసారిగా ఏపీ ప్రభుత్వ లెక్కలను తప్పు పడుతూ క్వాలిఫైడ్ ఓపీనియన్ ఇచ్చింది. లెక్కలకు సంబంధించిన వివరాలు లభ్యం కానప్పుడే కాగ్ క్వాలిఫైడ్ సర్టిఫికెట్ ఇస్తుందన్నారు పయ్యావుల కేశవ్. నేను ఏడాది క్రితం ఇదే చెబితే? ఆనాడు మంత్రి బుగ్గన నా ప్రకటనపై వెటకారాలు ఆడారు. సరిగ్గా ఇదే అంశాన్ని ఏడాది తర్వాత కాగ్ స్పష్టం చేసింది. లెక్కల్లేవంటూ కాగ్ తప్పు పట్టిన అంశం గురించి బుగ్గన ఏం వివరణ ఇస్తారు..? లెక్కల్లేని ఖర్చులకు సంబంధించి ఓ జీవో ద్వారా రాటిఫై చేయడాన్ని కూడా కాగ్ తప్పు పట్టింది. రాటిఫై చేసే అధికారం ప్రభుత్వానికి లేదంటూ కాగ్ స్పష్టంగా చెప్పింది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధులు రెట్టింపయ్యాయి.. పన్నుల భారాన్ని పెంచారు.. అప్పుల భారాన్ని పెంచారు. ఇంత చేసినా రూ. 48 వేల కోట్లకు సరైన లెక్కలు లేకుండా పోయాయి. ఎఫ్ఆర్బీఎం లిమిట్ దాటి అప్పులు తీసుకున్నారు. టీడీపీ హయాంలో ప్రతి శాఖలోనూ జరిగిన కేటాయింపులకు ఇప్పటి కేటాయింపులపై చర్చకు సిద్ధమా..? అని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ శాఖను ఈ ప్రభుత్వం మూసేసే దిశగా తీసుకెళ్తోంది. వ్యవసాయ శాఖలో జీతభత్యాల పోగా ఈ ప్రభుత్వం రైతు భరోసాకి మాత్రమే ఖర్చు పెడుతున్నారు. వ్యవసాయ శాఖలోని 11 అంశాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. ఇరిగేషన్ కోసం టీడీపీ రూ. 60 వేల కోట్లు ఖర్చు పెట్టాం.. మీరంత ఖర్చు పెట్టారు..? అన్నారు కేశవ్. అప్పులు పెరిగాయి.. ఆదాయం పెరిగింది.

## పేరుకే విమానాశ్రయాలు

కడప, మార్చి 26, పీ ప్రభుత్వం రాజధాని అమరావతి విషయంలో శీతకన్ను వేయడం.. కరోనా కారణంగా విజయవాడ ఎయిర్ పోర్టుకు రద్దీ తగ్గిపోయింది. వచ్చి, పోయే విమానాల రాకపోకలు అరవై శాతానికిపైగా తగ్గిపోయాయి. ప్రభుత్వం ఉడాన్ పథకంలో భాగంగా గతంలో విమానాలు నడిపిన ట్రూజెట్ వంటి సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆ కంపెనీలు కూడా తమ సర్వీసుల్ని నిలిపివేశాయి. ఇప్పుడు ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఆఫర్ ఇచ్చి మరీ ఇతర కంపెనీలను విమానాలు నడపాలని పిలుస్తున్నారు. ప్రధానంగా విజయవాడ నుంచి రాయలసీమలో ఎయిర్‌పోర్టులు ఉన్న కడప, కర్నూలుకు కనీసం ఒక్క సర్వీసును అయినా నడిపిచాలన్న పట్టదలతో ప్రభుత్వం ఉంది. కడపకు గతంలో విమానాలు ట్రూజెట్ నడిపేది. కానీ ప్రభుత్వం ప్రోత్సహించలేదు. దాంతో సర్వీసులు నిలిచిపోయాయి. కడప కు విమానాలు లేకుండా పోయాయి. జగన్‌తో పాటు సీఎం రమేష్ వంటి వాళ్లు తమ ప్రత్యేక విమానాలతో వెళ్లడానికే అది ఉపయోగపడుతోంది. ఇటీవల రూ. ఇరవై కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ చేసి విమానాలు తిప్పేలా ఇండిగోతో ఒప్పందం చేసుకోవాలని కేబినెట్‌లో నిర్ణయించారు. ఇటీవల కర్నూలు ఎయిర్ పోర్టుప్రారంభమమింది. ఓ సర్వీసు నడిపేలా చేయగలిగారు. ఇప్పుడు విజయవాడ నుంచి కూడా కర్నూలుకు ఓ సర్వీసును పెంచాలని.. రాయలసీమ వాసులకు విజయవాడతో కనెక్టివిటీ పెంచాలని ప్రయత్నిస్తున్నారు. ఇండిగోతో చర్చలు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. రాజధాని విషయంలో ప్రభుత్వం కాస్త మెత్తబడటంతో పరిపాలన తప్పనిసరిగా అమరావతి నుంచే జరగాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రభుత్వ వ్యూహంలో మార్పులు వచ్చాయని భావిస్తున్నారు. అందుకే బెజవాడకు ఎయిర్ కనెక్టివిటీని మళ్లీ పెంచుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## ఏపీలో రైల్వే జోన్ అడుగులు



విశాఖపట్టణం, మార్చి 26,ఏపీకి కేంద్రం మరో శుభవార్త చెప్పింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్, వాల్తేరు డివిజన్ స్థానంలో రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. జోన్ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్‌పై వచ్చిన సూచనలు, సలహాల పరిశీలన కోసం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త రైల్వేజోన్, రాయగడ డివిజన్ ఏర్పాటుకోసం 2020-21 బడ్జెట్‌లో రూ.170 కోట్లు కేటాయించామన్నారుదక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు డీపీఆర్ సమర్పించాక కొత్త రైల్వేజోన్, రాయగడ రైల్వే డివిజన్ ఏర్పాటుకు పరిధి, ఇతర అంశాల గురించి చాలా విషయాలు తమ దృష్టికి వచ్చాయని.. ఈ అంశాలను లోతుగా పరిశీలించడానికి సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవెల్ కమిటీని ఏర్పాటుచేశామన్నారు. కొత్త జోన్ ఏర్పాటుకు ముందస్తు ఏర్పాట్లు, ప్రణాళికలు చేపట్టాలని విశాఖపట్నంలోని దక్షిణ కోస్తా రైల్వే ఓఎస్డీకి నిర్దేశించినట్లు తెలిపారు. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి భూమిని ఎంపిక చేశామని చెప్పారు.కర్నూలు కోచ్ మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాప్ కేటాయింపులు రూ.560 కోట్లకు పెంపు: 2013-14లో రూ.110 కోట్లతో మంజూరుచేసిన కర్నూలు కోచ్ మిడ్‌లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాప్ కేటాయింపులను తాజాగా రూ.560.72 కోట్లకు పెంచినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకూ రూ.178.35 కోట్లు కేటాయించి రూ.171.2 కోట్లు ఖర్చుచేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం భూసేకరణలో ఆలస్యం చేయడం వల్లే ప్రాజెక్టు ఆలస్యం అవుతోందన్నారు. ఆ భూమిని గత ఏడాది నవంబరులో రైల్వేకి అందించినట్లు తెలిపారు.మరోవైపు కడప-బెంగుళూరు రైల్వేలైన్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం తన వాటా డిపాజిట్ చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిపేసినట్లు మంత్రి చెప్పారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లిస్తేనే పనులు మొదలవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా సమకూర్చనందున ప్రాజెక్టు పనులు నిలిపేశామని.. 2022-23 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.వెయ్యి మాత్రమే కేటాయించామన్నారు. ప్రభుత్వం రూ.289 కోట్లు డిపాజిట్ చేయాలన్నారు

## అధికారుల రీకాల్ కలకలం

విజయనగరం, మార్చి 26,విజయనగరంలో అధికారుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయా ? ధరల నియంత్రణతో మంచి పేరు తెచ్చుకున్న అధికారికి?అవినీతి ఆరోపణలు చుట్టుముట్టాయా? వ్యవహారానికి పుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రభుత్వమే రంగంలోకి దిగింది.విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ కిషోర్ కుమార్. రెవెన్యూ విభాగానికి అధిపతి. జనవరి 2020 లో జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. వచ్చిన తొలినాళ్లలో మంచి పని వాడన్న ముద్ర వేసుకున్నారు. లాక్‌డౌన్‌లో నిత్యావసరాల ధరలను? ప్రజలకు అందుబాటులో ఉండేలా ఓపెన్ మార్కెట్లను ఏర్పాటు చేశాడు. ఉన్నతాధికారులతో మంచి పేరు తెచ్చుకున్నారు. మార్కెట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వ్యాపారుల్లో దడ పుట్టించారు. అక్రమ నిల?వలు ఉంటే సహించేది లేదని హెచ్చరించడంతో ప్రజలు హర్షించారు. ఇవన్నీ ఆయనకు చిక్కుల తెచ్చిపెట్టాయి. కొందరు అధికారులు కిశోర్‌కుమార్‌ను టార్గెట్ చేస్తూ హేళన చేసేవారు.మంచి అధికారిగా గుర్తింపు ఉన్నప్పటికీ?అవినీతి ఆరోపణలు అదే స్థాయిలో వచ్చాయ్. దీంతో జేసీ కిశోర్‌కుమార్‌ను?ప్రభుత్వం రీకాల్ చేసింది. కొత్తవలస, భోగాపురం, పూసపాటి రేగ, డెంకాడ, విజయనగరం మండలాల్లో?22ఏ భూముల బదలాయింపులో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇనాం, మాజీ సైనికులకు ఇచ్చిన భూములకు సంబంధించి బదలాయింపుల ఫైళ్లను నిబంధనల ప్రకారం గ్రామ స్థాయి వీఆర్‌వో నుంచి తహసీల్దార్ ద్వారా జేసీ పరిష్కరించాలి. వారి ప్రమేయం లేకుండా జేసీ నేరుగా ఆ ఫైళ్లపై సంతకాలు చేస్తున్నట్లు సమాచారం. భోగాపురం విమానాశ్రయం భూముల వ్యవహారాల్లోనూ తప్పిదాలకు పాల్పడినట్లు తెలిసింది.

# చెత్త పన్నులపై సిపిఎం ధర్నా...

విశాఖపట్నం జీవీఎంసీ, సచివాలయ ఉద్యోగుల పై అక్రమ సర్క్యులర్లు, మెమోలు వెంటనే రద్దు చేయాలని, ప్రజలపై బెదిరింపులు ఆపి చెత్త పన్నులు రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.ఈ మేరకు విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్ర హం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బరి తెగించి వ్యవహరిస్తోందని మండిప డ్డారు. చెత్త పన్నులు వసూలు కోసం సచివాలయ, మున్సిపల్ సిబ్బందిని ప్రజల ఇళ్లపైకి దాడి కి పంపించడం దుర్మార్గపు చర్య అన్నారు. పన్నులు వసూలు చేయకపోతే సిబ్బంది జీవి తాల నుంచి రికవరీ చేస్తామని చెప్పి ఉద్యోగులను బెదిరించడం ఇదేమి చర్య అని ముఖ్యమంత్రిని ప్రశ్నించా రు. పన్నులపై ప్రజలలో ఉన్న వ్యతిరేక తను అర్థం చేసుకొని తక్షణం వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ప్రజలు తిరగబడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి జగ్గు నాయుడు, సిపిఎం కార్పొరేటర్ గంగారావు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు కోసం రక్త సంబంధాన్ని మరిచాడు..

ఏలూరు, మార్చి 26, మనీ సంబంధాల ముసుగులో మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. డబ్బు కోసం కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. సొంత వారు అని కూడా చూడకుండా దారుణాలకు పాల్పడుతున్నారు. తాజాగా పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పూజారి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి తగాదాల కారణంగా దారుణంగా హత్య చేశారని వెల్లడించారు. ఈ కేసులో అయిదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామ శివారులో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 21న పూజారి కొత్తలంక వెంకట నాగేశ్వరశర్మ దారుణ హత్యకు గురయ్యారు. అర్థరాత్రి అయినప్పటికీ భర్త ఇంటికి రాకపోవడంతో.. కుటుంబసభ్యులకు పూజారి భార్య సమాచారం అందించారు. ఈ క్రమంలో పూజారి ఆచూకీ కోసం రాత్రి ఆలయం వద్దకు వెళ్లిన కుటుంబసభ్యులు బయట ఆయన వాహనం కనిపించకపోవడంతో వెళ్లిపోయారు. పని మీద వేరొక ఊరికి వెళ్లి ఉంటారని భావించారు. తెల్లవారినప్పటికీ నాగేశ్వర శర్మ ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం గాలించారు.ఆలయ ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించి నాగేశ్వర శర్మ కుటుంబసభ్యులు హతాశులయ్యారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆస్తి విషయంలో తలెత్తిన విభేదాలతో నాగేశ్వర శర్మ తమ్ముడి కుమారుడు వీరవెంకట సుబ్రహ్మణ్య సుమంత్ ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. మరో నలుగురితో కలిసి ఈ హత్య చేసినట్లు విచారణలో తేలిందని వెల్లడించారు. వీరిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

# భారీ వాహనాలు ఢీ?..

### రసాయనాల వాహనాలుండడంతో ఉద్రిక్తత

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు గమన్ బ్రిడ్జిపై భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ఆరు వాహనాలు ఒకదానితో ఒకటి వెనక నుండి ఢీకొనడంతో ప్రమాదం వాటిల్లింది. భారీ స్థాయిలో ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదంలో ఒక కారు నుజ్జు నుజ్జు అయింది. ఆరు వాహనాల్లో రెండు ప్రమాదకరమైన రసాయనాలను తీసుకువెళ్లే వాహనాలు కావడంతో కొంత ఆందోళనకరమైన పరిస్థితి నెలకొంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగింది. అగ్నిమాపక సిబ్బందికి ఆంధ్ర సుగర్స్ కెమికల్స్ భద్రతా అధికారులు సహాయ సహకారాలు అందించారు. అప్పటికప్పుడు అంబులెన్స్ ను కూడా ఏర్పాటుచేసి, కొవ్వూరు ఆంధ్ర సుగర్స్ యాజమాన్యం క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ను అందించింది. 2 లారీలలో ఉన్న ట్రై క్లోరో ఫాస్పేట్, మిథనాల్ డై క్లోరైడ్ వల్ల ప్రజలకు హాని కలగకుండా కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది,ఆంధ్ర సుగర్స్ భద్రత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇంత భారీ రోడ్డు ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోవడం అదృష్టంగా భావించవచ్చు. స్వల్ప గాయాలతో డ్రైవర్లు బయటపడ్డారు. పోలీసులు ఉదయం నుంచి ట్రాఫిక్కు క్రమబద్దీకరించి, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. టోల్ గేట్ లో ఫాస్ట్ ట్రాక్ లేకపోవడంతో నిత్యము కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోవడంతో ప్రమాదాలు నిత్యము జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు.

ఇప్పటికైనా కొవ్వూరు గమన్ టోల్ గేట్ లో ఫాస్ట్ ట్రాక్ ఏర్పాటు చేసి, సరిపోయినంత సిబ్బందిని అందుబాటులో ఉంచేలా అధికారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వము తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలు తరలించాలని ప్రతిపాదించడం అన్యాయం

### తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు

బద్వేలు బద్వేల్ మున్సిపల్ సమావేశంలో వైస్ చైర్మన్ సాయి కృష్ణ ప్రభుత్వ కార్యాలయాలు మరో చోటికి తరలించాలని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీ నాయకులు తీవ్రమైన అభ్యంతరం తెలిపారు ఈ మేరకు శనివారం ఇన్ఛార్జి మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ కు వారు వినతి పత్రం సమర్పించారు ఈనెల 25వ తేదీ జరిగిన బద్వేల్ మున్సిపాలిటీ సమావేశంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తరలించాలని వైస్ చైర్మన్ సాయి కృష్ణ ప్రతిపాదించడం ఏమాత్రం బాగా లేదన్నారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు ఎంతో ముందు చూపుతో ఆలోచించి ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ప్రస్తుతం కార్యాలయాలు ఉన్న ప్రదేశంలో అన్ని అన్ని వసతులు ఉన్నప్పటికీ పట్టణంలోని బడా రాజకీయ నాయకులు వారు కొనుగోలు చేసిన స్థలాలు భూములు విలువ రావాలని ఒకే ఒక్క ఉద్దేశంతో వారు ఎంచుకున్న ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం ఏమాత్రం బాగా లేదన్నారు మున్సిపాలిటీ పరిధిలో 35 వార్డులు ఉండగా 30 వార్డుల ప్రజలకు ఇప్పుడున్న ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు మున్సిపాలిటీ కార్యాలయం అందరికీ అందుబాటులో ఉందని అది కాకుండా మరోచోట కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని వారు తెలిపారు కేవలం రాజకీయ కుట్రతోనే ఇదంతా జరుగుతున్నట్లు వారు ఆరోపించారు ట్రాఫిక్ సమస్యలు సాకుగా చూపించి ఇప్పుడున్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించాలని చూస్తున్నారని ఆరోపించారు

# సోలార్ పవర్ పై దృష్టి



కరీంనగర్, మార్చి 26, (న్యూస్ పల్స్)రానున్న రోజుల్లో సోలార్, పవర్ విండ్ ఎనర్జీ పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న నగరాల్లో కరీంనగర్ ముందు వరుసలో నిలిచింది. పునరుత్పాదక ఇంధనాన్ని (రెన్యువబుల్‌ఎనర్జీ) ప్రోత్సహించే దిశగా భారత్‌లో 13 నగరాలు మాత్రమే విధానాలను రూపకల్పన చేయగా వాటిలో కరీంనగర్ ఉన్నట్లు గ్రీన్ ఎనర్జీ పాలసీ నెట్‌వర్క్ అనే అంతర్జాతీయ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు గ్రీన్ ఎనర్జీ పాలసీ నెట్‌వర్క్ ఆర్‌ఈఎన్21ను విడుదల చేసింది. ఇందులో ప్రపంచంలో 1300 నగరాలు ఎంపికవగా, కరీంనగర్ నగరపాలక సంస్థకు కూడా స్థానం దక్కింది. ఇప్పటికే కరీంనగర్ స్మార్ట్‌సిటీ డీపీఆర్‌లోనే సోలార్ పవర్ విషయాన్ని పేర్కొన్నది. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు వేసింది. సుమారు నగరంలో 200లకు పైగా మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఏర్పాట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగానే నగరంలో 2700 చదరపు అడుగులు దాటిన అన్ని భవనాలపై తప్పనిసరిగా సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయాలని గతంలోనే పాలకవర్గం నిర్ణయం తీసుకుంది.స్మార్ట్‌సిటీ రెండో దశలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీనిలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కూడా డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రణాళికలో నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతోపాటు జాబితా సేకరించి ఏమేరకు నిధులు అవసరం అవుతాయన్న విషయంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటితో పాటు ప్రైవేటు భవనాలపైనా ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించడంతో పాటు భారీ విస్తీర్ణంలో ఉన్న భవనాలపై తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా నగరపాలక అధికారులు చర్యలు ప్రారంభిస్తున్నారు. స్మార్ట్ ప్రాజెక్టులో భాగంగానే 2019లోనే 19 ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పునరుద్దరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టీఎస్‌రెడ్‌కో)తో అప్పటి మేయర్ రవీందర్‌సింగ్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. దీంతోపాటు నగరపాలక సంస్థ కార్యాలయంపైనా సోలార్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

## బద్వేల్ పట్టణంలో ఎం.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో 5కే రన్

బద్వేలు బద్వేలుపట్టణం సిద్ధవటం రోడ్డు లోని విద్యానగర్ లో ఉన్న ఆర్డిఓ ఆఫీస్ హెలిప్యాడ్ వద్ద ఎం.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ, అడా చైర్మన్ శింగసాని గురు మోహన్ ,బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్డీవో వెంకటరమణ 5కే రన్ ను ప్రారంభించారు. ఈ రన్ సిద్ధవటం రోడ్ లోని హెలిప్యాడ్ నుంచి బయనపల్లి బొజ్జిరెడ్డి కల్యాణమండపం వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటరమణ మాట్లాడుతూ 5కే రన్ వలన పట్టణ ప్రజల యువతకు ఆరోగ్యరీత్యా చాలా ప్రయోజనాలు ఉంటాయని ,అలాగే ప్రకృతి పరిరక్షణ పై ప్రజలకు అవగాహన కలిగించారు. బద్వేల్ పట్టణంలో స్టేడియం కోసం స్థలాన్ని ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత వంకేల పొలిరెడ్డి, ఓబులరెడ్డి, అరణ్యవాసం సినిమా రచయిత,ప్రొడ్యూసర్ వివేక్, రెడ్డిసేవాసంస్థ అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి,కేశవరెడ్డి, మన్యం రెడ్డి, శివానందరెడ్డి ,ఎన్సిసి క్యాడెట్ లు, పట్టణంలోని యువకులు ,యువతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

తిరుపతి ఇద్దరు విద్యార్థులు వేరు వేరు ఘటనల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పద్మావతి జూనియర్ కళాశాల రెండవ అంతస్తులోని రూమ్ నెంబర్ 203 లో ఘటన జరిగింది. మృతురాలు చిత్తూరు జిల్లా కె.వి పల్లి మండలం గర్నిమిట్ట కు చెందిన విష్ణు ప్రియ(17) గాపోలీసులు గుర్తించారు. కువైట్ లో కూలిపనులకు వెళ్లిన సరస్వతి,గోవిందు దంపతుల కు ముగ్గురు సంతానం కాగా రెండవ కుమార్తె విష్ణుప్రియ. ప్రేమ వ్యవహారంలో కుటుంబ పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేశారని మనస్తాపం గురై ఆత్మహత్య చేసుకుందని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో ఐదవ అంతస్తు నుండి దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి వెస్ట్ చర్చ్ సమీపంలోని బీసీ హాస్టల్ వద్ద ఘటన జరిగింది. మృతుడు చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలంలోని భీమ గాని పల్లి కు చెందిన నాగేంద్ర కుమార్. ప్రేమించిన అమ్మాయి దూరమవుతుందని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వనాథ్,రేణుక దంపతుల ఒక్కగా నొక్క మగ సంతానం నాగేంద్ర. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

## భార్య గొంతు కోసిన భర్త

చిత్తూరు చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం చవట కుంటలో దారణం జరిగింది. భార్య, భర్త గొడవలో భార్య గొంతును భర్త కోసాడు. భర్త సూరి భార్య సౌందర్య (22) గొంతు కోయడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. బాధితురాలిని తిరుపతి రుయా అసుపత్రికి తరలించారు. వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీటీ రోడ్డు పనులు ప్రారంభం

### గిరిజనుల ఆనందం

విశాఖపట్నంహుకుంపేటగుర్రాలతోటలో రహదారి సమస్య తీరడం పై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వం నూత నంగా బిటి రోడ్డు మంజరు కావడం పనులు ప్రారంభం కావడం దశాబ్దాల నాటికళ నేడు నెరవేరడం పై ప్రభుత్వా నికి గుర్రాల తోట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.మండలంలోని తీగల వలస పంచాయతీ గుర్రాల తోట గ్రామంలో నూతనంగా ఒక కోటి 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదా రిని సందర్శించిన గ్రామస్తులు జై ఫొల్గు ణ .జై. సీఎం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ తమ గ్రామంలో దశాబ్దా ల కాలం నుంచి గత పాలకుల ఎవరు పట్టించుకోవడం ఈరోజు వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి రాగానే తమ గ్రామంలో నూతనంగా రోడ్డు నిర్మించిన చాలా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీ కాలవలు సంతోషం వ్యక్తం చేశారు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మదనపల్లె జిల్లా ఏర్పాటుకు పోరాటం

మదనపల్లె మదనపల్లె జిల్లా ఏర్పాటు విషయంలో జరిగిన అన్యాయం పై ప్రజలందర్నీ కలుపుకుని మదనపల్లెను జిల్లా చేసే వరకు పోరాడుతానని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాజహాన్ బాషా తెలిపారు. నేడు జిల్లా సాధన కోసం చేపట్టిన పాదయాత్ర మూడవ రోజుకు చేరుకుంది. తన పాదయాత్ర 100 కిలోమీటర్లు సాగుతుందని, యాత్ర ముగిసేలోపు అసెంబ్లీలో మదనపల్లె జిల్లాగా తీర్మానం చెయ్యాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే పీడీ యాక్టు

గుంటూరు అక్రమ మద్యం రవాణా,నాటుసారా తయారీ మరియు విక్రయం వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలపాలకు నిరంతరం పాల్పడితే పీడి చట్టం ప్రయోగిస్తామని గుంటూరు జిల్లా ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ అదనపు ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరు రూరల్ జిల్లా నరసరావుపేట ఎస్ఈబీ డివిజన్ అదే పనిగా నాటుసారా తయారు చేస్తూన్న అంగడి శ్రీనివాసరావు, మాచర్ల పట్టణం 20వ వార్డుకు చెందిన బత్తుల.బాల గురవయ్య అనే ఇద్దరు వ్యక్తులపై పీడి చట్టం కింద కేసులు నమోదు చేసామని వెల్లడించారు. అంగడి శ్రీనివాసరావు మరియు బత్తుల గురవయ్యలు నాటుసారా తయారీ మరియు విక్రయిస్తూ అదే జీవనోపాధిగా కొనసాగిస్తూ చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతుండగా చట్టపరంగా కేసులు నమోదు చేసి,భవిష్యత్తులో ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ వీరు తమ పద్ధతి మార్చుకోకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతూ,చట్టవ్యతిరేకమైన అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతుండగా వీరిపై పీడి చట్టం కింద కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు.

నాటుసారా తయారీ మరియు విక్రయిస్తున్న అంగడి శ్రీనివాసరావుపై 7 కేసులు నమోదవగా,ఈ కేసులలో 185 లీటర్ల నాటుసారా మరియు 2600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకోవడం జరిగినది. నాటుసారా తరలించడానికి ఉపయోగించిన 3 వాహనాలు(ఒక ఆటో,రెండు మోటార్ సైకిళ్ళు) సీజ్ చేసామని అన్నారు. అదే విధంగా బత్తుల.గురవయ్యపై 3 కేసులు నమోదవగా,ఈ కేసులలో 640 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని,నాటుసారా తరలిస్తున్న 2 వాహనాలను(ఇన్నోవా కారు,ఒక మోటార్ సైకిల్)సీజ్ చేసామని అన్నారు. గుంటూరు జిల్లాలో ఎవరైనా అక్రమ మద్యం రవాణా,నాటుసారా తయారీ మరియు విక్రయం వంటి చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.

## టిడ్కో ఇళ్ళు లబ్ధిదారులకు ఇవ్వకపోతే నేరుగా ఇళ్లలోకి దింపుతాం

### - రాజమండ్రి టిడిపి నాయకులు

రాజమహేంద్రవరం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇళ్ళు లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోతే త్వరలో లబ్ధిదారులకు నేరుగా వారి వారి ఇళ్లలోకి వెళ్ళే విధంగా చేస్తామని రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు టిడ్కో ఇళ్ళ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదిరెడ్డి వాసు, ఆదిరెడ్డి అప్పారావు, యర్రా వేణుగోపాల్ రాయుడు, కాశీ నవీన్ డిమాండ్ చేశారు.

# ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్

నంద్యాల( విభారె) :- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 424 బ్యాక్లాగ్ పోస్టులను జనరల్ కేటగిరి కి మార్చడం సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఒక సారి పునరాలోచన చేసుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ప్రకారం బ్యాక్లాగ్ పోస్టులు ఏ వర్గాలకు చెందితే ఆ వర్గాలకు కేటాయించాలని కోరారు. శనివారం నంద్యాల పట్టణంలోని స్థానిక జిపిఎస్ కార్యాలయంలో పాత్రికేయులతో ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 424 బ్యాక్ లాగ్ పోస్టులను జనరల్ గా మార్పు చేశారు అంటూ వార్త పత్రికలో కథనాలు వెలువడ్డాయి రిజర్వుడ్ కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేరని పేర్కొనడం అన్యాయమని అనేక అర్హతలు కలిగిన ఎస్సి, ఎస్టి నిరుద్యోగ అభ్యర్థులు తమ ఉద్యోగ అవకాశాలను కోల్పోతారు కాబట్టి ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అలాంటి హక్కు కలిగిన బ్యాక్లాగ్ పోస్టులను ఏ కారణం చేత ఎందుకు జనరల్ కేటగిరీలోకి మార్పు చేశారో రాష్ట్రంలో ఉన్న గిరిజన యువకులకు అర్థం కావడం లేదని అన్నారు. వెంటనే సదరు బ్యాక్ లాగ్ పోస్టుల రిక్రూట్మెంట్ కొరకు నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలా చేయకపోతే ఎస్సీ ఎస్టీ యువకులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని దళిత గిరిజనులకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు బాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ విజయ్ నాయక్, యువజన నాయకులు విక్రమ్ నాయక్, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఒంటిపూట తరగతులు ప్రారంభించాలి




ఎమ్మిగనూరు:-రాష్ట్ర ప్రభుత్వం ఒంటి పుట సెలవులు ప్రకటించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ.డీ.ఎస్.యూ) జిల్లా ఉపాధ్యక్షుడు బి. మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో మండల విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నది సుమారు 42 డిగ్రీల నుండి 45 డిగ్రీల వరకు ఎండ

- ఎండ తీవ్రత నుండి విద్యార్థులను కాపాడాలి
-పీ డీ ఎస్ యూ

తీవ్రత ఉన్నది ఈ నేపథ్యంలో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మాత్రం ఫ్యాన్ లేక కిటికీలు లేక క్లాస్ రూమ్ లోనే ఎండ తీవ్రత ఎక్కువై విద్యార్థులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నదని అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో అంతస్తులు మీద బిల్లింగ్ ఉన్న వాటిలో విద్యార్థుల బట్టలు కూడా ముద్దాయి పోతున్నాయని ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒంటిపూట బడులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో విద్యార్థులకు ఏమాత్రం ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగిలిన దానికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు పట్టణ అధ్యక్షులు సమీర్,నాయకులు రఘు, షకీల్, సిద్దు, రాఘవ, కార్తీక్, చరణ్, వినయ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

.. జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్



ఎమ్మిగనూరు:- విద్యార్థి దశ నుండే చట్టాలపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వివర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థిని,విద్యార్థులు సోదరభావంతో మెలుగుతూ సాధ్యమైన సహకారాన్ని అందించుకోవాలన్నారు. చదువు లేకపోవడం వలన ఏర్పడే పర్యవసానాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు న్యాయవాదులు విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాల చట్టం, బాలలహక్కుల చట్టం వంటి చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో న్యాయవాదులు మురళీకృష్ణ, విమల,రంగనాథ్, రఘురామ్, బి.శ్రీనివాసులు,లింగమూర్తి,కోర్టు సిబ్బంది కృష్ణవేణి, ఎంఇఓ ఆంజనేయులు, పాఠశాల హెడ్ మాస్టర్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజులు సమ్మె జయప్రదం చేయండి

కామనురు శ్రీనివాసులురెడ్డి నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, జాతి వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం!! సిఐటియు

బద్వేలు, ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఎల్.ఐ. సి బ్రాంచ్ కార్యలయం వద్ద ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడుతూఆర్.ఎస్.ఎస్. నేతృత్వ బి.జె.పి. ప్రభుత్వం నరేంద్రమోదీ, అమితాల ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో కార్మికవర్గంపై కత్తికట్టి దాడి చేస్తున్నది. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ప్రజల, కష్టజీవుల రక్తమాంసాలతో నిర్మించుకున్న కోటానుకోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వరంగాన్ని విశాఖస్టీల్తో సహా బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వేలు, విమానాలు, రక్షణ ఉత్పత్తులు, విద్యుత్, ఆయిల్, బొగ్గు మొత్తం ధ్వంసం చేస్తున్నారు. కారుచౌకగా వాటి ఆస్తులను, మిగులు భూములను ఆదానీ, అంబానీలకు అప్పచెప్తున్నారు. కార్మికవర్గం బ్రిటిష్ పాలనా కాలం నుండి పోరాటాలు ద్వారా సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను హరిస్తున్నారు. 44 చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి, కార్మికుల ఉమ్మడి బేరసారాల శక్తిని, సంఘం పెట్టుకొనే హక్కులను కొల్లగొట్టి కార్మికులను, ఉద్యోగులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదలివేశారు. ఈ దుష్ట విధానాలకు, ఏకపక్ష నిరంకుశ పద్ధతులకు నిరసనగా 50 కోట్లమంది కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే 10 కేంద్ర కార్మిక సంఘాలు, 450 స్వతంత్ర ఫెడరేషన్లు మార్చి 28,29 రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపిచ్చాయి. . అందుకే ఈ సమ్మె



దేశభక్తియుత సమ్మెఈ దేశభక్తియుత సమ్మెలో అన్ని రంగాల, విభాగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాల్సిన చారిత్రక అవసరం ఉన్నది. "ముందే కోతి, ఆపై కల్లు తాగింది" అన్న చందాన మోడీ ప్రభుత్వ

# టీడీపీ శ్రేణుల నిరసన

విశాఖపట్నం విశాఖలో టిడిపి శ్రేణులు నిరసన బాట పట్టాయి.రాష్ట్ర ప్రభుత్వం పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం యూఎల్సీ ఆధారంగా రెగ్యులరైజేషన్ కోసం రిజిస్ట్రేషన్ విలువ కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా చెల్లించాలంటూ నోటీసులు జారీచెయ్యడాన్ని నిరసిస్తూ జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షను చేపట్టారు. రెగ్యులరైజేషన్ పేరుతో అన్యాయంగా రిజిస్ట్రేషన్ చార్జీలను కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా చెల్లించెయ్యాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టిడిపి నేతలను తీవ్రంగా ఖండించారు.గత ప్రభుత్వ హాచంలో ఇళ్ల పట్టాలను అతితక్కువ ధరలకే అందించామని చెప్పిన నగర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు ... ప్రజలను దోచుకునే విదంగా ప్రభుత్వం వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు

# మార్చి 29వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద వృత్తిదారుల ఆందోళన

ఆంధ్రప్రదేశ్ చేతివృత్తుల దారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 29వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు చేతి వృత్తిదారుల ఆందోళన సంబంధించిన డిమాండ్ల కరపత్రాన్ని స్థానిక కార్మిక కర్షక భవన్ నందు సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.గోవిందు, ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ దేశంలో కార్పొరేట్ లను (ధనవంతులను) మరింత ధనవంతుడిగా చేయడానికి చేతి వృత్తులను దెబ్బతీశారని విమర్శించారు. రెండేళ్లుగా కరోనా బారిన పడి ఉపాధి కోల్పోయిన చేతి వృత్తిదారులకు ఏ మాత్రం ఆర్థిక సహాయాన్ని అందించ కపోగా! గతంలో చేతి వృత్తిదారులకు సహాయంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలు మహాత్మాగాంధీ పూన్ కార్ యోజన, రాష్ట్రీయ వికాస్ యోజన, బేడ్ పాలక్ బీమా యోజన పథకాలను ప్రధాని మోడీ రద్దు చేశారు

# రాజమౌళి ప్రతి సినిమా ఒక ప్రయోగమే!




రాజమౌళి .. తెలుగు సినిమా గురించి తెలిసినవారికి ఆయన పేరు తెలియకుండా ఉండదు. అంతగా ఆయన తెలుగు సినిమాపై .. తెలుగు ప్రేక్షకులపై తన ప్రభావం చూపించారు. దర్శకత్వం పట్లగల మక్కువతో ఆ దిశగా అడుగులు వేసిన రాజమౌళి .. 'శాంతినివాసం' అనే టీవీ సీరియల్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తరువాత ఆయన దృష్టి వెండితెర వైపుకు మళ్లింది. అక్కడ విద్యార్థి దశ నుంచి తన ప్రయాణాన్ని కొనసాగించాలనుకున్నారేమో 'స్టూడెంట్ నెంబర్ 1' సినిమాతో మెగాఫోన్ పట్టుకున్నారు.ఎన్టీఆర్ హీరోగా చేసిన ఈ సినిమాలో ఎక్కడా కూడా ఆయన తడబడలేదు. నీట్ గా తాను చెప్పదలచుకున్న విషయాన్ని చెబుతూ వెళ్లారు. ఆ తరువాత సినిమాను 'సింహాద్రి' టైటిల్ తోనే ఎన్టీఆర్ తో చేసి ఆయనకి మరో హిట్ ను అందించారు. ఇక స్పోర్ట్స్ నేపథ్యంలో కొత్తగా ఒక సినిమా చేయాలని రాజమౌళి చేసిన ప్రయత్నానికి ఫలితమే నితిన్ హీరోగా వచ్చిన 'సై'. ఈ సినిమా యూత్ కి ఒక రేంజ్ లో కనెక్ట్ అయింది. ఇక ఈ సారి మాస్ ఆడియన్స్ కి నచ్చే కంటెంట్ ప్రధానంగా ఉండాలి .. ఫ్యామిలీ ఆడియన్స్ ను థియేటర్స్ కి రప్పించే మదర్ సెంటిమెంట్ ఉండాలనే ఉద్దేశంతో ఆయన తెరకెక్కించిన సినిమానే 'ఛత్రపతి'.ప్రభాస్ హీరోగా రూపొందిన ఈ సినిమా అప్పటికీ .. ఇప్పటికీ ఆయన కెరియర్లో చెప్పుకోదగిన సినిమానే. ఈ సినిమాలో మదర్ సెంటిమెంట్ తో మెప్పించిన రాజమౌళి ఆ తరువాత ఫాదర్ సెంటిమెంట్ ప్రధానంగా 'విక్రమార్కుడు' సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాను కూడా అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించారు. ఇక కొత్తగా ఫాంటసీని ట్రై చేద్దామనే ఉద్దేశంతో ఆయన 'యమదొంగ' సినిమా చేశారు. యమలోకం నేపథ్యంలో అప్పటివరకూ వచ్చిన సినిమాలకు మించి ఉందనే టాక్ ను ఈ సినిమా సొంతం చేసుకుంది.రాజమౌళి సినిమాలు భారీతనానికి అలవాటు పడింది ఈ సినిమా నుంచే అని చెప్పవచ్చు. ఈ సినిమా కోసం భారీ సెట్లు వేయించిన ఆయన ఆ తరువాత అంతకంటే భారీ సెట్లతో రాచరికంతో కూడిన పునర్జన్మల కథాంశంతో ముందుకు కదిలారు. 'మగధీర' టైటిల్ తో రూపొందిన ఈ సినిమా అనూహ్యమైన విజయాన్ని సాధించింది. రాజమౌళి జానపద .. పౌరాణిక .. చారిత్రకాలను అద్భుతంగా తెరకెక్కించగలరు అనే ఒక నమ్మకాన్ని ప్రేక్షకుల్లో కలిగించారు. ఆ నమ్మకమే 'బాహుబలి' సినిమాకి బీజం వేసి ఉంటుంది.ఇక ఆయన నుంచి వచ్చిన 'బాహుబలి' .. 'బాహుబలి 2' తెలుగు సినిమా వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాయి. తెలుగు సినిమా చరిత్రను చెప్పుకోవాలంటే 'బాహుబలి'కి ముందు .. తరువాత అని చెప్పుకునేలా చేశారు. ఈ మధ్యలో ఆయన హీరోగా ఎలాంటి స్టార్ డమ్ లేని సునీల్ తో తక్కువ బడ్జెట్ లో 'మర్యాదరామన్న' చేసి హిట్ కొట్టారు.

# లోకేష్ కనగరాజ్ స్టార్ డైరెక్టర్స్ కి రివర్స్ మాస్టర్

నలుగురికి నచ్చినది నాకసలే ఇక నచ్చదురో..నరు లెవరు నడవనిది ఆ రూట్లో నే నడిచెదరో... 'టక్కరి దొంగ' చిత్రంలో మహేష్ బాబు పాత్రని పరిచయం చేసే క్రమంలో వచ్చే పాట ఇది. గేయ రచయిత చంద్రబోస్ ఏ టైమ్ లో ఈ పాట రాసారో కానీ ఈ పాటలోని అక్షరాల్ని తూచా తప్పకుండా పాటిస్తున్నాడు తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్. క్రేజీ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ నిర్మించిన అంథాలజీ 'అవియల్'లోని 'కాలం'ని రూపొందించి ప్రశంసలు అందుకున్న లోకేష్ కనగరాజ్ 'మా నగరం' చిత్రంతో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చారు.తొలి చిత్రంతో ప్రశంసలు దక్కించుకున్నారు. ఈ మూవీ తరువాత అందరు నడిచిన దారిలో నడిస్తే మన గొప్పేంటి అనుకున్నాడో ఏమో అత్యంత క్లిష్టమైన టాస్క్ ని ఎంచుకుని సినిమాలు చేయడం మొదలుపెట్టారు. మన స్టార్ డైరెక్టర్ రాజమౌళి 'బాహుబలి' చిత్రానికి రెండు భాగాలు చేసిన విషయం తెలిసిందే. ముందు ఫస్ట్ పార్ట్ ని రిలీజ్ చేసి ఆ తరువాత అంతకు మించిన క్రేజ్ ఏర్పడటంతో' బాహుబలి 2' ని తెరకెక్కించారు. ఈ రెండు పార్ట్ లు వరల్డ్ వైడ్ గా సంచలనం సృష్టించిన తెలుగు సినిమా స్థాయిని పెంచాయి. ఇక ఇటీవల ఇదే ఫార్మాలాని ఫాలో అవుతూ సుకుమార్ 'పుష్ప' చిత్రాన్ని తెరకెక్కించారు. ముందు నుంచే దీన్ని రెండు భాగాలుగా ప్లాన్ చేయని సుకుమార్ సినిమా మధ్యలోకి వచ్చేసరికి రెండు పార్ట్ లుగా చేయాలని ఆ తరువాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. పార్ట్ 1 బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి బన్నీని పాన్ ఇండియా స్టార్ గా మార్చడంతో పార్ట్ 2కి రెడీ అయిపోతున్నాడు.ఈ మూవీకి ముందే ప్రశాంత్ నీల్ 'కేజీఎఫ్'ని రెండు భాగాలుగా తీయబోతున్నానంటూ తొలి పార్ట్ రిలీజ్ ముందే చెప్పేశాడు. పార్ట్ 1 సంచలన విజయం సాధించడంతో పార్ట్ 2 ని మరింత పవర్ ఫుల్ గా తెరకెక్కించాడు. ఏప్రిల్ 14న పార్ట్ 2 విడుదలకు రెడీ అయిపోతోంది. ఈ ముగ్గురు స్టార్ డైరెక్టర్ల తీరు ఇలా వుంటే లోకేష్ కనగరాజ్ తీరు మాత్రం ఇందుకు రివర్స్ లో వుంది. ఎవరైనా ముందు ఫస్ట్ పార్ట్ ని తీశాక సెకండ్ పార్ట్ ని తీస్తారు. కానీ లోకేష్ కనగరాజ్ మాత్రం అలా చేయకుండా సెకండ్ పార్ట్ ని ముందు చేసి ఆ తరువాతే ఫస్ట్ పార్ట్ ని అంటే ప్రీక్వెల్ ని చేస్తున్నారు. కార్తీతో లోకేష్ కనగరాజ్ చేసిన చిత్రం 'ఖైదీ'. ఇందులో హీరోయిన్ వుండదు. తనకి సంబంధించిన కథే వుండదు. కానీ హీరోకు మాత్రం ఓ కూతురు వుంటుంది. తనని కాపాడటానికి హీరో పోలీసులకు సహాయం చేసే క్రమంలో అతని వెనక పెద్ద కథే వుందని ఆ కథకు ప్రస్తుత కథలో పోలీసుల్ని టార్గెట్ చేసిన గ్యాంగ్ స్టర్లకు సంబంధం వుందని దాన్ని ప్రీక్వెల్ లో చూపించబోతున్నట్టుగా లాకప్ లో వున్న హరీష్ ఉత్తమన్ పాత్రలో హింట్ ఇచ్చాడు లోకేష్ కనగరాజ్. అంటే 'ఖైదీ'కి ప్రీక్వెల్ వుందన్న మాట. ఇక విజయ్ తో చేసిన 'మాస్టర్' పరిస్థితి కూడా అంతే. ఇందులో హీరో విజయ్ ఎప్పుడూ ఏదో పోగొట్టుకుని డ్రంకెడిక్ట్ గా కనిపిస్తాడు. పక్కన మాళవిక మోహనన్ వంటి హీరోయిన్ వున్నా.. తనకి విజయ్ కి మధ్య ఎలాంటి డ్యూయెట్ లు కానీ ప్రత్యేకించి సీన్ లు కానీ వుండవు. ఏంటీ కథ అంటే అది వేరే వుందిలే అని హీరో విజయ్ పాత్ర చేత చెప్పించాడు లోకేష్ కనగరాజ్ అంటే 'మాస్టర్'కి కూడా ప్రీక్వెల్ వుందన్నమాట. మన వాళ్లు సీక్వెల్స్ చేస్తుంటే లోకేష్ కనగరాజ్ మాత్రం ప్రీక్వెల్స్ తో అదరగొట్టడానికి రెడీ అయిపోతుండటం విశేషం. అందుకే అతన్ని అంతా రివర్స్ మాస్టర్ అంటున్నారు.

# భారీ చిత్రాలన్నీ వచ్చేస్తున్నాయ్.. ఆ సినిమా రాదే

కరోనా కారణంగా థియేటర్లలో సందడి చేయడానికి జంకిన బిగ్ స్టార్స్ సినిమాలన్నీ పరిస్థితులు మారడం.. జనాలు థియేటర్లకు అలవాటు పడటంతో డిసెంబర్ నుంచి భారీ చిత్రాలన్నీ వరుస కట్టాయి. అయితే ఒకే ఒక్క సినిమా మాత్రం ఇంత వరకు ల్యాబ్ నుంచి బయటికి రావడానికి జంకుతోంది.




డిసెంబర్ లో అఖండ ఆకట్టుకుంది. ఆ తరువాత వచ్చిన 'పుష్ప' బాక్సాఫీస్ దుమ్ము దులిపేసింది. శ్యామ్ సింగరాయ్ అందినకాడికి సర్దేసింది. ఈ మూడు చిత్రాలు గత ఏడాది డిసెంబర్ లో విడుదలై ఇండస్ట్రీ వర్గాల్లో వున్న భయాల్ని పోగొట్టాయి.ఆ తరువాత జనవరి నుంచి మరో జాతర మొదలైంది. బంగార్రాజు దిగేశాడు. సంక్రాంతికి విడుదలైన ఈ మూవీ ఫరవాలేదనిపించింది. ఆ తరువాత ఫిబ్రవరిలో మరో జాతర మొదలైంది. 'డీజే టిల్లు' సైలెంట్ గా వచ్చి బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ లో డీజే మోత మోగించి చిన్న చిత్రాల్లో పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'భీమ్లానాయక్' ఎంట్రీతో థియేటర్ల వద్ద మాస్ జాతర మొదలైంది.మార్చి 11న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ 'రాధేశ్యామ్' విడుదలైంది. టాక్ డివైడ్ గా వనిపించినా బాక్సాఫీస్ వద్ద మాత్రం సాలీడ్ ఫిగర్ ని రాబట్టింది. ఈ శుక్రవారం ట్రిపుల్ ఆర్ తో ఈ నెలకు ఎండ్ కార్డ్ పడబోతోంది. వచ్చే నెల కేజీఎఫ్ చాప్టర్ 2 తో భారతీయ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ ల పరంగా సరికొత్త చాప్టర్ ఆవిష్కృతం కాబోతోంది. ఇలా భారీ క్రేజీ చిత్రాలన్నీ వరుస పెట్టి థియేర్లపై దండయాత్ర చేస్తుంటే ఒక్క మూవీ మాత్రం కిమ్మనకుండా సైలెంట్ గా వుండటం మేకర్స్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.అదే 'విరాట పర్వం'. రానా సాయి పల్లవి జంటగా నటించిన ఈ చిత్రం గత ఏడాది ఏప్రిల్ లో విడుదల కావాల్సింది. కరోనా కారణంగా ఈ మూవీ రిలీజ్ ని అన్ని చిత్రాలతో పాటే వాయిదా వేశారు. బ్యాక్ టు బ్యాక్ మిగతా చిత్రాల మేకర్స్ తమ చిత్రాలని వరుసగా రిలీజ్ చేస్తుంటే 'విరాటపర్వం' మాత్రం నుంచి మాత్రం ఎలాంటి అప్ డేట్ రావడం లేదు. దర్శకుడు వేణు ఊడుగుల కూడా మౌనం పాటిస్తున్నాడు. ఎవరు రిలీజ్ గురించి అడిగినా మౌనమే ఆయన సమాధానంగా వినిపిస్తోంది.క్రేజీ కాంబినేషన్ తో రూపొందించిన ఈ మూవీని ఎందుకు విడుదల చేయడం లేదన్నది ప్రతీ సినీ లవర్ మెదడుని తొలిచేస్తోంది. ఇందుకు సురేష్ బాబు ప్రధాన కారణమని కొంత మంది వాదిస్తున్నారు. ఇటీవల నారప్ప దృశ్యం 2 చిత్రాలని ఓటీటీలో విడుదల చేశారు సురేష్ బాబు. అదే పంథాలో ఈ మూవీని కూడా ఓటీటీకే ఇచ్చేస్తున్నారంటూ వార్తలు వినిపించాయి.కానీ మేకర్స్ నుంచి దీనిపై ఎలాంటి స్పందన లేదు. 1990వ దశకంలో ఉత్తర తెలంగాణలో నక్సల్స్ ఉద్యమం పీక్స్ లో వుంది. ఆనాటి యదార్థ సంఘనటల సమాహారంగా ఉత్తర తెలంగాణ నేపథ్యంలో దర్శకుడు వేణు ఊడుగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రారంభం నేంచే భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీ కోసం ఆడియన్స్ చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ మూవీ రిలీజ్ కి సంబంధించిన అప్ డేట్ ని మాత్రం మేకర్స్ ఇవ్వడం లేదు. దీంతో సినీ లవర్స్ ఇంత మంది చిత్రాన్ని ఎందుకు హోల్డ్ లో పెట్టారని మేకర్స్ పై కామెంట్ లు చేస్తున్నారట.

# ఆటగాళ్లను ఊరిస్తున్న ఆ రికార్డులేంటో చూద్దాం..!

ఐపీఎల్ 2022 సీజన్ ఆరంభ మ్యాచ్లో ఇవాళ (మార్చి 26) డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, కోల్కతా నైట్రైడర్స్ జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సీజన్ నుంచి సీఎస్కే, కేకేఆర్ జట్లు కొత్త కెప్టెన్లతో బరిలోకి దిగుతున్నాయి.చెన్నై జట్టుకు రవీంద్ర జడేజా, కేకేఆర్ను శ్రేయస్ అయ్యర్ ముందుండి నడిపించనున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్గా



బరిలోకి దిగుతున్న సీఎస్కే.. క్యాష్ రిచ్ లీగ్లో ఇప్పటికే 4 టైటిళ్లు సొంతం చేసుకుని మరో టైటిల్ కోసం తహతహలాడుతుండగా, 2 ఐపీఎల్ టైటిళ్లను సాధించిన కేకేఆర్ సైతం కొత్త కెప్టెన్? నేతృత్వంలో ప్రత్యర్థులకు ఛాలెంజ్ విసురుతుంది. బలాబలాల విషయానికొస్తే.. ఇరు జట్లు క్యాష్ రిచ్ లీగ్లో ఇప్పటివరకు 26 సార్లు తలపడగా, సీఎస్కే 17, కేకేఆర్ 8 సందర్భాల్లో విజయాలు సాధించాయి. మరో మ్యాచ్లో ఫలితంగా తేలలేదు. ఇక, నేటి మ్యాచ్లో ఇరు జట్ల ఆటగాళ్లను పలు అరుదైన రికార్డులు ఊరిస్తున్నాయి. అవి ఏంటంటే.సీఎస్కే సీనియర్ బ్యాటర్ అంబటి రాయుడు ఈ మ్యాచ్లో మరో 84 పరుగులు చేస్తే ఐపీఎల్ 4000 పరుగుల క్లబ్లో చేరతాడు.చెన్నై సూపర్ కింగ్స్ ఆల్రౌండర్ డ్వేన్ బ్రావో (167) ఈ మ్యాచ్లో మరో 4 వికెట్లు తీస్తే ఐపీఎల్లో అత్యధిక వికెట్లు తీసిన మలింగ (170 వికెట్లు) రికార్డును బద్దలు కొడతాడు. ఈ సీజన్లో కేకేఆర్ తరఫున ఆడుతున్న వెటరన్ బ్యాటర్ అజింక్య రహానే ఐపీఎల్లో నాలుగు వేల పరుగులు పూర్తి చేసేందుకు మరో 59 పరుగుల దూరంలో ఉన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190